# నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
గురువారం
19 ఫిబ్రవరి 2026




చేవెళ్ల మున్సిపాలిటీ నూతన పాలకవర్గం చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్ సభ్యులు బుధవారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను చించల్ పేట్ లోని స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. - చేవెళ్ల నినాదం



## మున్సిపల్ పాలకవర్గానికి సన్మానం

**చేవెళ్ల ఫిబ్రవరి 18 (నినాదం):-**



చేవెళ్ల మున్సిపల్ నూతన పాలక వర్గం, చైర్మన్ దేవర సమత వెంకట్ రెడ్డిని, కౌన్సిలర్ బండారి శైలజ ఆగిరెడ్డి, మంగలి కళ్యాణి యాదగిరి, తాళ్లపల్లి నర్సింలు, కృష్ణ నాయక్ ను ఊరెళ్ళ 1,2 వార్డు కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసిన కర్నె శివప్రసాద్, గుట్టల జ్యోతి రాజేందర్, సీనియర్ నాయకుడు కుంచం కుమార్ మాజీ సర్పంచ్ జహంగీర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సునుగంటి కుమార్ ఆధ్వర్యంలో శాలువలతో ఘనంగా సన్మానించారు. ఊరెళ్ళ 1,2 వార్డుల అభివృద్ధికి కృషి చేస్తామని చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సతీష్, షెరీఫ్,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన విద్యా విధానం రద్దు చేయాలి

**ఏఐఎస్ఎఫ్ నుంచే విద్యార్థి సంఘాలు పుట్టుకొచ్చాయి.. అన్ని విద్యార్థి సంఘాలకు మాతృ సంఘం ఏఐఎస్ఎఫ్**

**భవిష్యత్తు అంతా విద్యార్థులదే: కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు**

**నిజామాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 18 (నినాదం)**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానం రద్దు చేయాలని, ప్రభుత్వాలు కార్పొరేట్ యాజమాన్యానికి వత్తాసు పలుకకుండా, అందరికీ ఒకే ఉచిత విద్యా విధానాన్ని రూపొందించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. భగత్ సింగ్, చేగువేరా స్ఫూర్తితో విద్యార్థులు ఉద్యమించాలన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోనీ టిటిడి కళ్యాణ మండపంలో అఖిల భారత విద్యార్థి పరిషత్ రాష్ట్ర 4వ మహాసభలు మూడు రోజులు పాటు నిర్వహించనున్నారు. ముందుగా మొదటిరోజు ప్రెస్ క్లబ్ నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ నీ ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ శివ లింగ రాజన్ జండా ఊపి ప్రారంభించారు. ఏఐఎస్ఎఫ్ జెండాలు పట్టుకుని, తలకు రిబ్బన్లు కట్టుకొని విద్యార్థులు భారీ ఎత్తున నిర్వహించిన ఈ ర్యాలీ పులాంగ్ చౌరస్తా మీదుగా టిటిడి కళ్యాణ మండపానికి చేరుకుంది. సభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, విశిష్ట అతిథులుగా రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, మాజీ జాతీయ అధ్యక్షులు తక్కెలపల్లి శ్రీనివాస్ రావు, ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ శివ లింగ రాజన్, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి బనోతు రఘురాం, ఏఐకేఎస్ రాష్ట్ర నాయకులు కంజర భూమయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వై.ఓమయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి కొత్తగూడెం శాసనసభ్యులు కూనం నేని సాంబశివరావు మాట్లాడుతూ.. ఏఐఎస్ఎఫ్ విద్యార్థుల సమస్యలకై అలుపెరుగని పోరాటాలు చేస్తుందన్నారు. అన్ని విద్యార్థి సంఘాలకు మూలం ఏఐఎస్ఎఫ్ అని, ఇది అన్ని సంఘాలకు తల్లి లాంటిదని అన్నారు. ఎందరో నాయకులు ఈ విద్యార్థి సంఘం ద్వారా ఎదిగారని, తాను కూడా ఈ సంఘం ద్వారా నాయకత్వ లక్షణాలు అలవర్చుకున్నానని గుర్తు చేశారు. క్రమశిక్షణ గల వాడే సరైన నాయకుడని, ప్రతి ఒక్కరూ నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. ఓర్పు, సహనం ఎంతో అవసరమని, నాయకుడికి క్రమశిక్షణతో పాటు దేహదారుఢ్యం కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు దేశభక్తితో పాటు తల్లిదండ్రుల పట్ల గౌరవ మర్యాదలతో ఉండాలన్నారు. భవిష్యత్తులో మంచి స్థానంలో నిలవాలంటే తల్లిదండ్రుల కలలను నిజం చేయాలంటే లక్ష్యం నిర్దేశించుకుని అందుకు తగ్గట్లు కృషి చేయాలన్నారు. విద్యార్థులు ప్రణాళికతో చదివి, సమాజానికి కుటుంబానికి తోడ్పాటు అందించాలన్నారు. దేశ భవిష్యత్తు విద్యార్థులపై ఉందని, చెడు సహవాసాలు విడిచిపెట్టి, మంచి మార్గం వైపు అడుగులు వేయాలన్నారు. అందుకు ఏఐఎస్ఎఫ్ ఎంతో తోడ్పాటుని అందిస్తుందని, క్రమశిక్షణ నేర్పుతుందని, విద్యార్థులు ఎదుగుదలకు ఏఐఎస్ఎఫ్ బాటలు వేస్తుందన్నారు. విద్యార్థి దశలో దేశానికి ఏదైనా చేయాలని ఆకాంక్ష ఉంటుందని, అది భవిష్యత్తుకు పునాది అవుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా విధానంలో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మార్కుల కోసం కాకుండా జ్ఞానం పెంపొందించే దిశగా విద్యా విధానం ఉండాలన్నారు. విద్యార్థి నాయకులు సైతం అలాంటి పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నిజామాబాద్ జిల్లాలో 4వ రాష్ట్ర మహాసభలు ఇంత గొప్పగా నిర్వహించడం సంతోషకరమైన విషయమని, అందుకు పనిచేసిన ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గానికి అభినందనలు తెలుపుతున్నామన్నారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ మాట్లాడుతూ దేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడవలసిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ఆ లక్ష్యం కోసం పని చేయాలన్నారు. కష్టపడి చదవకుండా ఇష్టపడి చదివి తల్లిదండ్రులకు గొప్ప పేరు తీసుకురావాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య అభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందని, రాష్ట్ర ముఖ్య మంత్రి విద్యా అభివృద్ధికి, విద్యార్థుల కోసం నిధులు కేటాయిస్తున్నారన్నారు. జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేశామన్నారు. జిల్లాకు ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేస్తుందన్నారు. విద్యార్థులు హక్కులు ఏంటో తెలుసుకొని ఆ హక్కుల సాధన కోసం పాటుపడాలన్నారు. విద్యార్థి దశ కీలకమని మంచి మార్గాన్ని ఎంచుకోవాలన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ శివలింగ రాజన్ మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థ ప్రైవేట్, కార్పొరేట్ యజమాన్యాల చేతుల్లోకి వెళ్లిందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేస్తున్నాయని, ఇది సరైన నిర్ణయం కాదన్నారు. ఉచితంగా నాణ్యమైన విద్యను అందించినప్పుడే దేశాభివృద్ధి జరుగుతుందన్నారు. నాణ్యమైన విద్య కోసం ఏఐఎస్ఎఫ్ అలుపెరుగని పోరాటాలు చేస్తుందని, మా పోరాటాల వల్లనే విద్యార్థులకు ఎంతో లబ్ధి చేకూరింది అన్నారు. కేంద్ర ప్రభుత్వం యూజీసీ ద్వారా ఉన్నత విద్యాసంస్థలకు నిధులు రాకుండా చేస్తుందన్నారు. విద్యార్థులు భగత్ సింగ్, చేగువేరా హీరోలుగా గుర్తించాలని, సినిమా హీరోలని కాదని ఈ సందర్భంగా సూచించారు. నిజామాబాద్ జిల్లాలో నాలుగవ రాష్ట్ర మహాసభలు ఘనంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఆఫీస్ బేరర్స్ ఇటికెల రామకృష్ణ, గ్యార నరేష్, రెహమాన్, కాసోజు నాగజ్యోతి, బరిగేలా వెంకటేష్ , ఏఐకేఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజారెడ్డి, రాజేశ్వర్, రాజన్న, స్వరూపరాణి, విట్టల్ గౌడ్, దశరథ్, పాల్గొన్నారు.






## అక్రమ కేసులు ఎత్తివేయాలని తహశీల్దార్ కు వినతి

**కల్వకుర్తి ఫిబ్రవరి 18 (నినాదం)**

ఆమనగల్లు మున్సిపాలిటీ చైర్మన్,వైస్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా కొంత మంది బిఆర్ఎస్ కార్యకర్తలు, చైర్మన్ పత్యానాయక్ ఆసుపత్రి పై దాడి చేశారు. దాడి చేసిన సమయంలో అక్కడ లేని మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్, కౌన్సిలర్ పాపిశెట్టి రామకృష్ణ ల పై అక్రమంగా అట్రాసిటీ కేసు నమోదు చేయడాని వ్యతిరేకిస్తూ బుధవారం ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో కల్వకుర్తి పట్టణంలో ఆర్యవైశ్యులందరూ వారి వ్యాపార సముదాయాలను మూసివేసి బంద్ పాటించారు. ఆర్యవైశ్యులందరూ వాసవి మాత దేవాలయం నుంచి బైక్ ర్యాలీతో తహశీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకొని. ఆర్యవైశ్యులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ తో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ కు అందజేశారు. ఈ సందర్భంగా మహాసభ నాయకులు గంధం ప్రసాద్, శివాలయం శ్రీనివాస్, గంప శ్రీనివాస్ మాట్లాడుతూ అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు దోంతు శ్రీను, దాచేపల్లి మనోహర్, హరీష్, తిరుపతయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

**జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ బి. యం. సంతోష్**





**గద్వాల ప్రతినిధి ఫిబ్రవరి 18( నినాదం)**

బాల్య వివాహాలు నిర్మూలించేందుకు స్వచ్ఛంద సేవా సంస్థలు, సంబంధిత శాఖల అధికారులేకాక ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ పిలుపునిచ్చారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ సౌజన్యంతో రూరల్ డెవలప్మెంట్ సొసైటీ జస్ట్ రైట్స్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలన పై అవగాహన కల్పించేందుకు బాల్య వివాహ ముక్త్ భారత్ వంద రోజుల కార్యక్రమంలో భాగంగా రూపొందించిన రథయాత్ర వాహనాన్ని బుధవారం ఐడిఓసి ఆవరణలో జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బి. ఎం. సంతోష్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు దాటినప్పటికీ అక్కడక్కడ బాల్యవివాహాలు జరుగుతుండడం బాధాకరమన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని గట్టు, కేటీ దొడ్డి మండలాల్లోని కొన్ని గ్రామాల్లో బాల్యవివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వీటిని నిర్మూలించేందుకు ప్రజలందరూ సామాజిక బాధ్యతతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలకు సన్నాహాలు చేస్తుంటే ముందుగానే తెలుసుకొని ఆపివేసేందుకు చిత్త శుద్ధితో కృషి చేయాలని, చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. అమ్మాయిలకు 18 ఏళ్లలోపే పెళ్లి చేయడం వలన వారి చదువు మధ్యలోనే ఆగిపోతుందని, ఆరోగ్య పరంగానూ ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. చిన్న వయసులోనే గర్భం దాల్చడం వలన తల్లితోపాటు శిశువు ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని ఫలితంగా రెండు, మూడు తరాలు వివిధ సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బాల్య వివాహాల్లో పాలుపంచుకునే వారందరికీ చట్టపరంగా వివిధ శిక్షలు వేయడం జరుగుతుందని ప్రజలకు పూర్తిస్థాయిలో అర్థమయ్యేలా అవగాహన కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించాలన్నారు. పౌరులందరూ బాల్యవివాహాల నిర్మూలనను సామాజిక బాధ్యతగా భావించి ప్రభుత్వానికి సహకరించాలని పేర్కొన్నారు. 2030వ సంవత్సరం నాటికి దేశంలో బాల్యవివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, బాల్య వివాహ ముక్త్ భారత్ ఈ రథయాత్ర ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ సందేశం ప్రతి మండలానికి, గ్రామానికి, ప్రతి ఒక్క ఇంటికి చేరేలా సంబంధిత శాఖల అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం బాల్యవివాహాల నిర్మూలనపై ముద్రించిన కరపత్రాలను జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి విడుదల చేశారు. బాల్య వివాహాలు లేని భారతదేశము నినాదంతో రూపొందించిన సిగ్నేచర్ క్యాంపెయిన్ బోర్డుపై కలెక్టర్ తో పాటు పలువురు అధికారులు తమ సంతకాలు చేశారు. అలాగే బాల్యవివాహాల నిర్మూలన ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ శంకర్, డిడబ్ల్యూఓ సునంద, డీఈవో విజయలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నుషిత, డీసీపీఓ నరసింహ, రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షురాలు చిన్నమ్మ థామస్, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, జస్ట్ రైట్స్ సమన్వయకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో ఆలయ పూజారి మృతి

**వెల్గటూర్,ఫిబ్రవరి18 (నినాదం న్యూస్):**

జగిత్యాల జిల్లా పెంభట్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వెల్గటూర్ హనుమాన్ ఆలయంలో పురోహితుడిగా విధులు నిర్వర్తిస్తున్న వకుళబరణం నరసింహ స్వామి (70) అయ్యగారు ఆకస్మికంగా మృతి చెందారు.బుధవారం తన ద్వి చక్ర వాహనం పై పెంభట్ల ఆలయానికి వెళ్ళి వస్తుండగా మార్గ మధ్యలో మూల మలుపు వద్ద వాహనం అదుపుతప్పి క్రింద పడడంతో నరసింహ స్వామి తలకు బలమైన గాయాలయ్యాయి.వెంటనే స్థానికులు 108 కీ సమాచారం అందించడంతో జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మద్యంలోనే పూజారి మృతి చెందాడు.ప్రమాదంలో పూజారి సతీమణికి స్వల్ప గాయాలయ్యాయి.వెల్గటూర్ లో గత ఇరవై ఏళ్లుగా హనుమాన్ ఆలయంలో పూజారిగా విధులు నిర్వహిస్తూ.. అందరితో కలివిడిగా ఉండే అయ్యగారు అకాల మరణం చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## అశ్వాపురం స్మశాన వాటిక దయనీయ స్థితి

**అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలంటూ ఎమ్మెల్యేకు వినతి**

**అశ్వాపురం, ఫిబ్రవరి 18 (నినాదం):**

పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ను అశ్వాపురం సర్పంచ్ బానోత్ సాధర్లాల్, ఉప సర్పంచ్ తుళ్లూరి ప్రకాష్ రావు కలిసి గ్రామ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ఉన్న రెండు స్మశాన వాటికల్లో ఒకటి రెవెన్యూ కార్యాలయం సమీపంలో ఉండగా, అశ్వాపురం నుంచి అమేర్ద గ్రామం వైపు నిర్మించిన రహదారి కారణంగా ఆ స్మశాన వాటిక సుమారు మూడు అడుగుల మేర లోతుగా మారిందని వారు వివరించారు. దీంతో వర్షాకాలంలో అక్కడ నీరు నిల్వ ఉండి బురదగా మారుతుండటంతో అంత్యక్రియలు నిర్వహించడం తీవ్ర ఇబ్బందిగా మారిందని తెలిపారు. అదనంగా ముళ్ల చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగి స్మశాన వాటిక అధ్వాన స్థితికి చేరుకుందని పేర్కొన్నారు. అశ్వాపురం గ్రామ ప్రజలు, ముఖ్యంగా గౌతమీ నగర్ వాసులు అధిక సంఖ్యలో ఈ స్మశాన వాటికనే వినియోగిస్తున్నారని, దాని విస్తీర్ణం సుమారు రెండు ఎకరాలు ఉన్నందున అభివృద్ధి పనులు చేపట్టేందుకు విస్తృత అవకాశాలు ఉన్నాయని వివరించారు.కాబట్టి స్మశాన వాటికలో మట్టి పోయించి స్థలాన్ని సమతల పరచడం, చుట్టూ ప్రహరీ గోడ నిర్మించడం, అంత్యక్రియల కోసం షెడ్లు, నీటి సదుపాయం, విద్యుత్ దీపాలు వంటి మౌలిక వసతులు కల్పించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.




## అంగన్వాడి కేంద్రంలో పోషకాహార పంపిణీ

**గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు కోడిగుడ్లు, పాలు పంపిణీ**

**అశ్వాపురం,ఫిబ్రవరి18 (నినాదం):**

మండల పరిధిలోని చింతిర్యాల గ్రామపంచాయతీ పరిధిలోని చింతిర్యాల కాలనీ అంగన్వాడి కేంద్రంలో బుధవారం పోషకాహార పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కేంద్రం ద్వారా గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారులకు కోడిగుడ్లు, చక్కెర పిండి, పాలు పంపిణీ చేశారు.ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు మరియు చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పోషకాహార పదార్థాలను క్రమం తప్పకుండా అందజేస్తోందని సర్పంచ్ కోనసా అలివేలు, ఉప సర్పంచ్ వెన్న అశోక్ కుమార్ తెలిపారు. గ్రామంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రం వద్ద పెంచుతున్న కూరగాయలు, ఆకుకూరలను పరిశీలించి సర్పంచ్, ఉప సర్పంచ్ సంతోషం వ్యక్తం చేశారు. పిల్లల ఆరోగ్యవృద్ధికి పోషకాహారం ఎంతో అవసరమని, అంగన్వాడి సిబ్బంది చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు.కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ యన్నా అరుణకుమారి, ఆయా కాంతమ్మతో పాటు గ్రామ మహిళలు, తల్లులు, గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.




## ఆర్టీసీ బస్సులో అక్రమంగా తరలిస్తున్న గుడుంబా పట్టివేత

**ఇద్దరు మహిళలను అరెస్టు చేసిన వీణవంక పోలీసులు**



**జమ్మికుంట, ఫిబ్రవరి 18 (నినాదం)**

వీణవంక మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు ఆర్టీసీ బస్సులో అక్రమంగా గుడుంబాను 20 లీటర్లు సరఫరా చేస్తున్నారనే సమాచారం మేరకు ఎస్సై ఆవుల తిరుపతి ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించారు. చల్లూరు గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు 20 లీటర్ల కుటుంబాలు బస్సులో తరలిస్తుండగా పోలీసులు పట్టుకొని విచారించగా గ్రామ శివారులో గుడుంబా బట్టి ఉన్నట్లు తెలిపారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని బెల్లం పానకమును ధ్వంసం చేసి గుడుంబా తయారీకి విక్రయించిన సామాగ్రి తో పాటు సహకరించిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి పేర్కొన్నారు.

## ఎస్జీటీ పోస్టుల కన్వర్షన్ను ఉపసంహరించుకోవాలి

**టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగళరావు**

**పాలేరు ఫిబ్రవరి 18( నినాదం)**

ఉన్నత పాఠశాలలో హెచ్ఐయం, పీఈటీ పోస్టుల భర్తీ కోసం 2325 కీలకమైన ఎస్జీటీ పోస్టులను కన్వర్షన్ చేయటానికి చేసే ప్రతిపాధనలను ఉపసంహరించుకోవాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.వెంగళరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం సింగారెడ్డిపాలెం పాఠశాలలో సబ్ కమిటి సమావేశం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. ఉన్నత పాఠశాలల అభివృద్ధి పేరుతో ప్రాథమిక పాఠశాలలను నిర్వీరం చేయటం తగదని అన్నారు. ప్రాథమిక పాఠశాలలను మూసివేయాలని ప్రమాదకరమైన ఆలోచనల ను ప్రభుత్వం విరమింపంచేయాలని హెచ్చరించారు. జీవో నెంబర్ 25 ను వెంటనే సవరించి ప్రాథమిక పాఠశాలలో 20 మంది విద్యార్థులున్న చోట ఇద్దరు ఉపాధ్యాయులను 30 మంది ఉన్న చోట ముగ్గురు ను 30 కి,పైగా ఉన్న చోట ప్రతీ తరగతి ఉపాధ్యాయుడు ను నియమించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన ఉద్యోగుల హెల్త్ స్కీమ్ లను ప్రజలలో భాగస్వామ్యమైన ఉద్యోగస్తులకు నగదు రహిత కార్పోరేట్ వైద్యం ను అందించాలని కోరారు. పెండింగ్ లో ఉన్న డీఏ లను, పీఆర్సీ ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశం లో మండల అధ్యక్ష. కార్యదర్శులు గోవిందరావు. రామారావు, సబ్ కమిటి సభ్యులు కోటేశ్వరరావు, చిన్నా, రవి. గణేష్, జ్యోతి, భాగ్యలక్ష్మి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




## రామాలయ అభివృద్ధికి చేయూత

**రూ.5 లక్షల విరాళం అందించిన పెద్దోళ్ల దయాకర్**

**చేవెళ్ల,ఫిబ్రవరి 18(నినాదం ):**

చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని దామరగిద్ద గ్రామ రామాలయ అభివృద్ధికి 10వ వార్డు కౌన్సిలర్ పెద్దొళ్ల దయాకర్ తన వంతు సహకారంగా రూ.5 లక్షలను బుధవారం ఆలయ కమిటీకి అందజేశారు. ఆలయ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ ఈ విరాళాన్ని అందించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు దయాకర్ సేవాభావాన్ని ప్రశంసిస్తూ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి అండగా నిలిచినందుకు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు.



# నినాదం
## తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

గురువారం
19 ఫిబ్రవరి
2026


# నరేంద్ర మోడీ ఆదానీలకు అంబానీలకు కొమ్ముకాస్తున్నారు

**భారతీయ కమ్యూనిస్టు పార్టీ జాతీయ సభ్యులు రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య**




**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 18 (నినాదం) :** దేశంలో ప్రధాని నరేం ద్ర మోడీ లకు కొమ్ముకాస్తున్నారని భారతీయ కమ్యూనిస్టు పార్టీ జాతీయ సభ్యులు పాలనాకుల జంగయ్య అన్నారు. బుధవారం ఆయన రాజేంద్రనగర్ సిపిఐ కార్యాలయంలో మండల కార్యదర్శి కన్య గారి నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన సిపిఐ నాయకుల సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్ర రూపం దాలుస్తుంది అన్నారు కేంద్రంలో బిజెపి రెండు కోట్ల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చిందన్నారు అధికారంలోకి వచ్చిన వెంటనే హామీలను మర్చిపోయారన్నారు దేశంలో ఉన్న సంపదను దోచుకుని విదేశాల్లో దాచుకున్న నల్లధనాన్ని తీసుకువచ్చి దేశంలో ఉన్న ప్రతి పౌరుడికి ఖాతాలో జమ చేయాలన్నారు తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా వదిలేశారు అన్నారు రైతుల ఖాతాలో వెంటనే రైతుబంధును వేయాలన్నారు ప్రజా సమస్యలపై తమ పార్టీ నిరంతరం పోటం చేస్తుందన్నారు రాష్ట్రంలో అనేకమంది నిరుద్యోగ నిరుద్యోగులు ఉన్నారు అన్నారు ఇంటి నిర్మాణం కోసం స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేశారు గత ప్రభుత్వం ఆయంలో చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ నిర్మాణం చేపట్టింది అందులో నిరుపేదలకు ఇండ్లను కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా మాజీ కార్యదర్శి సీనియర్ నాయకులు పుస్తకాలు నరసింహారావు, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు రామస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంఏ రియాజ్ జిల్లా సమితి సభ్యులు జె ఆనంద్ గౌడ్, మండల సహాయ కార్యదర్శి కన్న గారి లక్ష్మి, జె విజయ, ఆనంద్ గౌడ్, జి సత్యం, ఎండి సలీం సయ్యద్ ఖాజా, సదానంద్ గౌడ్, మునీశ్వరి మౌనిక, రామచందర్ షబ్బీర్, గంగారం తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణంలో బంగారు ఆభరణాలను ధరించకపోవడం సురక్షితం

**చేవెళ్ల ట్రాఫిక్ సిఐ సతీష్**



**చేవెళ్ళ ఫిబ్రవరి 18:( నినాదం):** మహిళలు ప్రయాణం చేసేటప్పుడు వీలైనంత వరకు బంగారు ఆభరణాలు ధరించకపోవడం ఉత్తమం అని చేవెళ్ల ట్రాఫిక్ సిఐ సతీష్ అన్నారు బుధవారం రాత్రి శంకర్‌పల్లి మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ప్రయాణికులపై మార్పు తీసుకురావడానికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఆర్టీసి బస్సులలో సీట్ల కొరకు హాడావుడిలో ఎక్కెటప్పుడు తోపులాటాలో ఆభరణాలను దొంగలి స్తారు. చుట్టు ప్రక్కల వారిని గమనించలని, అపరిచితులను నమ్మి, కొద్దిగా బ్యాగు, లగేజిలను చూస్తూ ఉండండి అని వెళ్ళవద్దు అని అన్నారు.ప్రయాణాలలో తెలియని వ్యక్తులు ఇచ్చిన తిను బండారాలను తీసుకో కూడదని, తెలియని వ్యక్తులు పరిచయం పెంచుకుని బాగా మాట్లా డినా నమ్మకండి. రైళ్లు, బస్సు ప్రయాణంలో మహిళలు కిటికీల వద్ద కూర్చోకండి. ఒక వేళ కిటికీ వద్ద కూర్చున్నా మహిళలు తమ మెడలోని బంగారు ఆభరణాలను స్కార్ఫ్ లేదా చీరతో కప్పేయండి. చిన్నపాటి జాగ్రత్తలు పాటించడం ద్వారా చోరీలను నివారించవచ్చన్నారు. నేరాల నివారణకు, అసాంఘిక శక్తుల కదలికలపై పోలీసులకు సమాచారం అందించడం ద్వారా సహకరించాల న్నారు. శాంతి భద్ర తల పరిరక్షణకు, ప్రజల సహకారం ఎంతో అవసరమని, ఎక్కడైనా అనుమా నితులు కన్పిస్తే, అత్యవసర సమయంలో వెంటనే డయల్ 100 కు ఫోన్ చేసి స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ సురేష్ ఉన్నారు.

# కాలుష్యం కోరల్లో "జంగం గుట్ట"

**కాలుష్యం వెదజలుతున్న డంపింగ్ యార్డు**
**పరిసర ప్రాంత ప్రజలకు ఆరోగ్యానికి ముప్పు.**
**ప్రజలకు ఇబ్బంది కలగ కుండా నిర్వహణ చేపట్టాలని బీజేపీ జిల్లా యువ నాయకుడు డాక్టర్ వైభవ్ రెడ్డి డిమాండ్**





డపింగ్‌లో కాలుష్య కొరలు..

**చేవెళ్ల ఫిబ్రవరి 18 (నినాదం):** డంపింగ్ యార్డులలో ప్లాస్టిక్ వ్యర్థల కాల్చడం వలన వెలువడే కాలుష్యం చుట్టుపక్కల రైతులు ప్రజల ఆరోగ్యానికి పెను ముప్పు అని భారతీయ జనతా పార్టీ రంగరెడ్డి జిల్లా యువ నాయకుడు డాక్టర్ వైభవ్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేసారు.. చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని జంగంగుట్ట డంపింగ్ యార్డ్‌లో కాలుస్యం విషాన్ని చిమ్ముతున్నాయి.గుట్టలు గుట్టలుగా ప్లాస్టిక్ వ్యర్థలు పేరుకుపోయాయి..ఈ నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ జిల్లా నాయకుడు డాక్టర్ వైబావ్ రెడ్డి మాట్లాడుతూ డంపింగ్ యార్డులో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థలను కాల్చడం వలన చుట్టూ ప్రక్కల రైతులు ప్రజలు అనారోగ్యలా బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చడం వల్ల తీవ్రమైన కాలుష్యం ఏర్పడుతోందని విషపూరిత పొగవాయువులు ప్రజల ఆరోగ్యానికి హానికరంగా మారుతున్నాయి. అలాగే మంటలు సమీపంలోని వ్యవసాయ పొలాలకు వ్యాపించి రైతుల పంటలకు నష్టం కలిగిస్తున్నాయని చేవెళ్ల పరిధిలోని ఇతర ప్రాంతాల్లో కూడా డంపింగ్ యార్డుల నిర్వహణ సరిగా లేకపోవడం ప్రజలకు ఆరోగ్యనికి హానికరం అని అన్నారు.సంబంధింత అధికారులు ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

**సంక్షేమ హాస్టల్స్‌ను సందర్శించిన సర్పంచ్ మాచర్ల కుమారస్వామి**



**భీమదేవరపల్లి ఫిబ్రవరి 18 (నినాదం) :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల కేంద్ర గ్రామమైన భీమదేవరపల్లిలో బుధవారం ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టళ్లను సర్పంచ్ మాచర్ల కుమారస్వామి సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టళ్లలో నివసిస్తున్న విద్యార్థులతో మాట్లాడి వారికి ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాల గురించి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం స్వీకరించి, ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు అందించే భోజనంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, నాణ్యమైన ఆహారాన్ని నిర్ణీత సమయానికి అందించాలని హాస్టల్ నిర్వాహకులకు సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. అదేవిధంగా పదవ తరగతి విద్యార్థులకు "ఆల్ ఇన్ వన్" పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రతిరోజూ ఉదయం గ్రంథాలయాన్ని సందర్శించి పుస్తక పఠన అలవాటు పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. చదువుతో పాటు క్రమశిక్షణ, పరిశుభ్రత కూడా అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్



శనిగరం ఐలయ్య, బీసీ హాస్టల్ వార్డెన్ వీరన్న నాయక్, ఎస్సీ హాస్టల్ వార్డెన్ సంపత్, బొల్లంపల్లి శ్యామ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ఎస్ఎస్ ఎవ్వరికీ వ్యతిరేకం కాదు

**ఆర్ఎస్ఎస్ అఖిల భారతీయ కార్యకారిణి సభ్యులు రామ్ మాధవ్**



**కరీంనగర్, ఫిబ్రవరి 18(నినాదం) :** సంఘ్ ఎవ్వరికీ వ్యతిరేకం కాదని, ప్రతి ఒక్కరూ దేశాన్ని ప్రేమించాలని, దేశ ఉన్నతి కోసం పని చేయాలని ఆర్ఎస్ఎస్ కోరుకుంటుందని అఖిల భారతీయ కార్యకారిణి సభ్యులు రామ్ మాధవ్ జి అన్నారు. సంఘ శతజయంతి లో కరీనగర్ పట్టణంలో ప్రతిష్టిత వ్యక్తుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ప్రధాన వక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ, సంఘాన్ని అర్థం చేసుకోవటం కష్టం, అపార్థం చేసుకోవటం సులువని అన్నారు.

సంఘం వందేళ్ల ప్రయాణాన్ని నాలుగు దశలుగా చెప్పుకోవచ్చని మొదటి దశలో సంఘము అవరోధాన్ని, వ్యతిరేకతని ఎదుర్కొందని, రెండవ దశలో ప్రజల్లోకి వెళ్లి అనుకూల వాతావరణాన్ని నిర్మించుకుందని, మూడవ దశలో సామాజిక సమస్యల పరిష్కారానికి నడుం బిగించిందని, దీంతోనే వివిధ క్షేత్రాలు ప్రారంభమయ్యాయన్నారు.. నాలుగవ దశలో దేశంలోని సామాన్య జన బాహుళ్యంలోకి సంఘం విస్తరించిందని సోదాహరణంగా చెప్పారు. సంఘం కొత్త సిద్ధాంతాన్ని చెప్పటం లేదని ప్రాచీన కాలం నుండి వస్తున్న సాంస్కృతిక పరంపర నుండి వికసించిన అంశాలనే చెబుతుందని తెలిపారు.

వేదాలు,పురాణాలు,ఉపనిషత్తులు,భగవద్గీత, రామాయణ, మహాభారతాల పరంపరలోని అంశాలే సంఘం చెప్తున్న సిద్ధాంతమని చెప్పారు. ఇదే ఆలోచనతో అరవింద ఘోష్, బాలగంగాధర తిలక్,మహాత్మా గాంధీ, అంబేద్కర్ లు కూడా పనిచేశారని చెప్పారు. డాక్టర్ హెడ్గేవార్ జీ అదే పరంపరలో సంఘ్ ను స్థాపించారన్నారు. సంఘం పని పూర్తి కాలేదని, భవిష్యత్ భారత నిర్మాణం కోసం పంచ పరివర్తన ను ముందు నిలిపిందని వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ విభాగ్ సహసంఘచాలకులు డాక్టర్ చక్రవర్తుల రమణాచారి , జిల్లా సంఘచాలకులు నిరంజన చారి, జిల్లా సహసంఘచాలకులు ఎలగందుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# చత్రపతి శివాజీ మహారాజ్ 396వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలి

**శోభాయాత్రలో యువత అధిక సంఖ్యలో పాల్గొనాలి తిమ్మాపురం శివ**



**నల్లబెల్లి, ఫిబ్రవరి 18 (నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి నర్సంపేట పట్టణంలో నిర్వహించనున్న ఛత్రపతి శివాజీ మహారాజ్ 396వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు హిందూ భక్త బాంధ వులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని శివాజీ మహారాజ్ యువసేన నల్లబెల్లి మండల అధ్యక్షుడు తిమ్మాపురం శివ పిలుపునిచ్చారు.బుధవారం మండల కేంద్రంలో మాట్లాడుతూ, ధైర్యం, దేశభక్తి, ధర్మ పరిరక్షణకు ప్రతీకగా నిలిచిన శివాజీ మహారాజ్ ఆశయాలు నేటి యువతకు ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. మహనీయుల జయంతులు సమాజంలో ఐక్యత, సేవాభావం, దేశభక్తి విలువలనుపెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు. గురువారం నర్సంపేట పట్టణంలో శివాజీ మహారాజ్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గోగుల రాణా ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో మహా శోభాయాత్రనిర్వహించనున్నట్లు చెప్పారు. సాయంత్రం 5 గంటల నుండి 7 గంటల వరకు పట్టణ ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర సాగుతుందని వివరించారు. నల్లబెల్లి మండలానికి చెందిన హిందూ భక్త బాంధవులు, యువకులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అన్ని వర్గాల ప్రజలు శాంతి, సామరస్య వాతావరణంలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని సూచించారు.

# తపాలా భీమా చెక్కు అందజేత



**ప్రజలందరూ తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలి**

**భీమదేవరపల్లి, ఫిబ్రవరి 18 (నినాదం):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ గ్రామానికి చెందిన గడల రాజయ్య నెలకు రూ.850 ప్రీమియంతో రెండు లక్షల రూపాయల విలువైన తపాలా ఇన్సూరెన్స్ పాలసీని గట్లనర్సింగాపూర్ పోస్టాఫీసులో తీసుకున్నారు. ఇటీవల అనారోగ్యంతో ఆయన మృతి చెందడంతో, నామినీ అయిన ఆయన భార్య గడల రాజమ్మకు రూ.3,75,000 విలువైన భీమా చెక్కును తపాలా శాఖ అధికారులు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన తపాలా శాఖ అసిస్టెంట్ సూపరిండెంట్ లక్ష్మి సత్యబాబు మాట్లాడుతూ, ఇతర బీమా కంపెనీలతో పోలిస్తే తపాలా శాఖలోని ఇన్సూరెన్స్ పథకాలు పూర్తిగా భారత ప్రభుత్వ హామీతో ఉంటాయని తెలిపారు. అతి తక్కువ ప్రీమియంతో అధిక బోనస్ (ఒక లక్షకు ఆర్‌పీఎల్ఐ -- రూ.4800, పీఎల్ఐ -- రూ.5200) అందించబడుతుందని పేర్కొన్నారు. ఈ సదుపాయాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవడం ద్వారా తమ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించుకోవచ్చని సూచించారు. అంతేకాకుండా తపాలా శాఖ కేవలం ఇన్సూరెన్స్‌కే పరిమితం కాకుండా వివిధ రకాల పొదుపు పథకాలను కూడా నిర్వహిస్తున్నదని, వాటిని కూడా ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గ్రామ సర్పంచ్ బొల్లంపల్లి అజయ్ కుమార్ మాట్లాడుతూ, 150 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగి, నిస్వార్థంగా భారత ప్రభుత్వ హామీతో సేవలందిస్తున్న తపాలా శాఖ సేవలను గ్రామ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గట్లనర్సింగాపూర్‌ను సంపూర్ణ భీమా గ్రామంగా తీర్చిదిద్దేందుకు తనవంతు సహకారం అందిస్తానని తపాలా శాఖ అధికారులకు హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పాలకవర్గం సభ్యులు, మాజీ సర్పంచులు ఎర్రబెల్లి తిరుపతిరావు, సల్పాల తిరుపతి యాదవ్, తపాలా శాఖ అధికారులు భీమదేవరపల్లి పోస్టుమాస్టర్ జక్కు రజనీకాంత్, ఎంఓ ఓదెలు, గట్లనర్సింగాపూర్ గ్రామ పోస్టుమాస్టర్ తిరుపతి నాయక్, అసిస్టెంట్ పోస్టుమాస్టర్ రవీందర్, లంకదాసరి సంపత్ తదితరులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# చత్రపతి శివాజీ జయంతి వేడుకలకు హాజరు కావాలని కోరుతూ ఎంపీ ఈటల రాజేంద్రకు ఆహ్వానం



**మల్కాజిగిరి, ఫిబ్రవరి 18 (నినాదం) :** నేరేడ్ మెట్ డివిజన్ పరిధిలోని ఆర్ కే పురం లోని ఆదిదేవ్ అసోసియేషన్, హిందూ వాహిని, డిఫెన్స్ కాలనీ లో హిందూ ఏకతా యూత్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 19న నిర్వహించనున్న ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలకు హాజరుకావాలని కోరుతూ బుధవారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ని బీజేపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానపత్రిక ను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆర్కే శ్రీను, మహిపాల్ రెడ్డి, కొతపల్లి ఉపేందర్ రెడ్డి, బీజేపీ నేరేడ్ మెట్ డివిజన్ అధ్యక్షులు ఆదిత్య, రమేష్ గౌడ్, శ్యామ్, ఆకారం సాయి, సాయి ప్రవేశ్, మహేష్, బాబీ, తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ క్రాప్ సర్వేయర్‌గా గిరిజనులనే నియమించాలి



**డోర్నకల్ /మరిపెడ ఫిబ్రవరి 18(నినాదం) :** మహబూ బాద్ జిల్లా మరిపెడ మండలం తానంచర్ల రెవెన్యూ గ్రామ పరిధిలో డిజిటల్ క్రాఫ్ట్ సర్వే వాలంటరీ నియమ కంలో అవకాతవకలు జరిగినట్టు గిరిజన యువత, యువకులు విలేకరుల సమావేశంలో తమ బాధను వెలిబిచ్చుకున్నారు. తానంచర్ల రెవెన్యూ గ్రామ పరిధిలో అత్యధికంగా గిరిజన రైతులు వ్యవసాయాన్ని నమ్ముకుని జీవనాధారాన్ని గడుపుతుంటే,క్రాప్ డిజిటల్ సర్వే విభాగంలో గిరిజన యువతి, యువకులకు అవకాశం కల్పించకుండా తానంచర్ల ఏఈఓ నిష్పాశపతం వహిస్తూ మరొకరికి ఆ ఉద్యోగాన్ని కేటాయించడాన్ని గిరిజన యువతి,యువతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని వాల్యా తండా గ్రామపంచాయతీ యువకుడు తన ఆవేదనను వ్యక్తం చేశారు.అధిక రైతులు గిరిజన జనాభా కలిగిన వారికే డిజిటల్ క్రాఫ్ట్ సర్వే వాలంటరీగా నియమించాలని కోరారు.

# విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి

**కరాటే కిట్స్ అందించిన ప్రొద్దటూర్ గ్రామ వార్డు సభ్యులు**




**చేవెళ్ళ ఫిబ్రవరి18 (నినాదం) :** చేవెళ్ల నియోజకవర్గం శంకర్ పల్లి మండల పరిధిలోని ప్రొద్దటూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం విద్యార్థుల్లో క్రీడా ప్రోత్సాహాన్ని పెంపొందించే లక్ష్యంతో గ్రామ వార్డు సభ్యులు కరాటే కిట్స్ పంపిణీ చేశారు.విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వార్డు సభ్యులు ఏనుగు నరేందర్ రెడ్డి,నట్టల అనిత రమేష్,ఎనికెపల్లి మాధవ్,బ్యాగరి సింహంరాజు,కవేలి తిరుపతి రెడ్డి కలిసి తమ సొంత నిధులతో కరాటే మాస్టర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటే కిట్లను అందజేశారు.వార్డు సభ్యులు మాట్లాడుతూ... నేటి విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు,ఇతర ప్రతిభా రంగాల్లో కూడా ముందుం డాలని సూచించారు.కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం,శారీరక దృఢత్వం, క్రమశిక్షణ పెంపొందిస్తాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్యార్థుల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.కరాటే కిట్స్ అందుకున్న విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ వార్డు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.తమ గ్రామానికి రాష్ట్ర,జాతీయ స్థాయిలో మంచి పేరు తీసుకురా వడా నికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యా యులు,మాజీ సర్పంచ్ ఏనుగు నర్సింహా రెడ్డి,పట్నం మోహనరెడ్డి,అల్లవాడ రజినీకాంత్ రెడ్డి, సుధాకర్ రెడ్డి,ఏనుగు మహేందర్ రెడ్డి,మన్నె మహేందర్ ప్రవీణ్, నాగేష్, మహేందర్,శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నినాదం

గురువారం 19
ఫిబ్రవరి 2026

తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం


## మున్సిపల్ పాలకవర్గానికి సన్మానం



**చేవెళ్ల ఫిబ్రవరి 18 (నినాదం):-**
చేవెళ్ల మున్సిపల్ నూతన పాలకవర్గం, చైర్మన్ దేవర సమత వెంకట్ రెడ్డిని, కౌన్సిలర్ బండారి శైలజ ఆగిరెడ్డి, మంగలి కళ్యాణి యాదగిరి, తాళ్లపల్లి నర్సింలు, కృష్ణ నాయక్ ను ఊరెళ్ళ 1,2 వార్డు కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసిన కర్నె శివప్రసాద్, గుట్టల జ్యోతి రాజేందర్, సీనియర్ నాయకుడు కుంచం కుమార్ మాజీ సర్పంచ్ జహంగీర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సునుగంటి కుమార్ ఆధ్వర్యంలో శాలువలతో ఘనంగా సన్మానించారు. ఊరెళ్ళ 1,2 వార్డుల అభివృద్ధికి కృషి చేస్తామని చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సతీష్, షెరీఫ్,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## యాకయ్య కుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేత.



**నల్లబెల్లి, ఫిబ్రవరి 18 (నినాదం):**
వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం లో దస్తగిరిపల్లె గ్రామంలో ఇటీవల మరణించిన కుమ్మరి యాకయ్య కుటుంబానికి బిఆర్ఎస్, నాయకులు ఆదరణగా నిలిచారు. గ్రామ సర్పంచ్ పులి రమేష్ ఆధ్వర్యంలో యాకయ్య కుటుంబ సభ్యులకు 50 కేజీల బియ్యాన్ని ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పులి రమేష్ మాట్లాడుతూ, గ్రామంలో ఎవరికి ఏవైనా కష్టాలు వచ్చినా తమ పార్టీ గ్రామ పంచాయతీ తరపున సహాయం అందించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు. యాకయ్య మరణం గ్రామానికి తీరని లోటని, ఆయన కుటుంబానికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు.
కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు భాష బోయిన రాజు, మాజీ సర్పంచ్ పెండ్యాల సుధాకర్, వార్డు సభ్యులు గుంపుల రాజు, పుట్టపాక రవి, గంగరబోయిన శ్రీధర్, సంగి సురేష్, సంగి నర్సయ్య, బొల్లె నవీన్, పెంబర్తి సదయ్య ఇతర గ్రామ కార్యకర్తలు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు ఈ సహాయ కార్యక్రమాన్ని అభినందిస్తూ, అవసర సమయంలో కుటుంబానికి అండగా నిలిచిన బిఆర్ఎస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## క్యాతనపల్లిలో కొనసాగిన బంద్

### -బాల్క సుమన్ ఇంటి వద్ద పోలీసుల హంగామా

**మంచిర్యాల,ఫిబ్రవరి18(నినాదం):** క్యాతనపల్లి మున్సిపల్ కౌన్సిల్‌లో ఆడబిడ్డలపై మీద కాంగ్రెస్ దౌర్జన్యం చేయడాన్ని ఖండిస్తూ బీఆరఎస్, సీపీఐ ఆధ్వర్యంలో బంద్ కొనసాగుతోంది. మున్సిపాలిటీలోని వ్యాపారులు, వివిధ సంఘాలు, ప్రజలు ప్రజా తీర్పుకు మద్దతు తెలిపి బంద్‌లో పాల్గొన్నారు. బంద్ సందర్భంగా మున్సిపాలిటీలో భారీగా పోలీసులు మోహరించారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్యను హౌస్ అరెస్టు చేశారు. ఇక నిన్న మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా పోలీసు సిబ్బందిపై దాడి చేశారని బాల్క సుమన్‌పై కేసు నమోదుచేశారు. ఈ నేపథ్యంలో బాల్క సుమన్‌ను అరెస్టు చేసేందుకు పోలీసులు ఆయన ఇంటి ముందు చేరుకున్నారు. ఈ విషయం తెలిసి భారీగా బీఆరఎస్ శ్రేణులు అక్కడకు చేరుకున్నాయి. దీంతో బాల్క సుమన్ ఇంటి ముందు ఉద్రిక్తత నెలకొంది

## వేగంగా అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు

### -ప్రమాదంలో మెదక్ వ్యాపారి మృతి

**మెదక్,ఫిబ్రవరి18(నినాదం):** మెదక్ జిల్లా కొల్చారం గ్రామ శివారులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంగా వచ్చిన ఓ కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. మృతుడిని మెదక్ పట్టణానికి చెందిన వీవీ సిల్క్స్ బట్టల షాపు యజమాని వనపర్తి రోహిత్ గుప్తా (50) గా గుర్తించారు. క్షతగాత్రుడిని ఎల్లారెడ్డికి చెందిన విజయ్‌గా గుర్తించారు. వీరు విజయవాడకు వెళ్లి తిరిగొస్తుండగా ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.
యాక్సిడెంట్ గురించి సమాచారం తెలియగానే పోలీసులు ఘటనాస్థలికి వచ్చి పరిశీలించారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

## మక్తల్‌లో 20 నుంచి 24 వరకు సీఎం కప్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

### -తెలంగాణ రాష్ట్రం గర్వపడేలా కబడ్డీ పోటీలు నిర్వహణ

### -పోటీల ఏర్పాట్లపై అధికారులతో మంత్రి వాకిటి శ్రీహరి టెలికాన్ఫరెన్స్

**హైదరాబాద్,ఫిబ్రవరి18(నినాదం):** మక్తల్‌లో సీఎం కప్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను జాతరలా నిర్వహించాలని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. మక్తల్‌లో ఈనెల 20 నుంచి 24 వరకు నిర్వహించే కబడ్డీ పోటీల నిర్వహణపై ప్రజాప్రతినిధులు, జిల్లా అడిషనల్ కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎం కప్-2026లో భాగంగా మక్తల్ పట్టణంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నామని, వీటిని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. కబడ్డీ నిర్వహణ ఏర్పాట్లపై అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయం చేసుకోవాలని మంత్రి దిశానిర్ధేశర చేశారు. ఈనెల 20 నుంచి 24 వరకు కబడ్డీ పోటీలు జరుగనుండటంతో అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను అధికారులు సీరియస్‌గా తీసుకోని పనిచేయాలని ఆదేశించారు. మక్తల్ లో నిర్వహించే కబడ్డీ పోటీలు ఇతర రాష్ట్రాలకు దిక్సూచిగా నిలిచేలా నిర్వహణ ఉండాలని అభిప్రాయపడ్డారు. అందుకోసం అతిథ్యం, స్టేడియం, ఇతర ఏర్పాట్లపై దృష్టి సారించాలని అధికారులకు మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. ఈ కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు 33 జిల్లాలనుంచి క్రీడాకారులు రానుండటంతో అన్ని ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత మనపై ఉందని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. క్రీడల్లో పాల్గొనేందుకు వచ్చే వారికి వసతులు తదితర అంశాల్లో ఎలాంటి అసౌకర్యం కలుగుకుండా చూసుకోవాలని తెలిపారు. క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల విద్యార్థులను కబడ్డీ పోటీల్లో భాగస్వాములను చేయాలని విద్యాశాఖ అధికారులను మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశించారు. ఈ కబడ్డీ పోటీలకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు అతిథులుగా హాజరవుతున్నారని, వారందరిని గౌరవించుకోవాలని సూచించారు. పోలీస్, స్పోర్ట్స్, శానిటరీ, మున్సిపల్, విద్యుత్ అధికారులు ఎప్పటికప్పుడూ జిల్లా ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుంటూ కబడ్డీ పోటీలను విజయవంతానికి కృషిచేయాలని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ప్రజాప్రతినిధులు కూడా కబడ్డీ పోటీలను సవాల్‌గా తీసుకోని అధికారులతో కలిసి ముందుకుపోవాలని మంత్రి చెప్పారు.

# క్యాతన్‌పల్లిలో అసలు సమస్య బాల్క సుమనే

**-తమపై దాడి చేసి కారు అద్దాలు ధ్వంసం**

**-కోరం లేకనే చైర్మన్ ఎన్నిక వాయిదా**



మంచిర్యాల,ఫిబ్రవరి18 (నినాదం):
బీఆరఎస్ నేత బాల్క సుమన్ తీరుపై తెలంగాణ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమన్ తమపై దాడి చేసి కారు అద్దాలు ధ్వంసం చేశారని ధ్వజమెత్తారు. ఇదేం పద్ధతని.. ఈ విషయంలో బాల్క సుమన్‌ని హరీశ్‌రావు సమర్థిస్తారా అని ప్రశ్నించారు. బుధవారం క్యాతనపల్లిలో మీడియాతో మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడారు. క్యాతనప్లలెలో ఎలాంటి సమస్య లేదని స్పష్టం చేశారు. సుమన్ దౌర్జన్యం అందరూ చూశారన్నారు. సుమన్ ఆరోపణలన్నీ అబద్దాలేనని మండిపడ్డారు. ఆయన రెచ్చగొట్టి డ్రామాలు చేస్తున్నారని ఆగ్రహించారు. మొదటిరోజు కోరం లేకపోవడంతో క్యాతనపల్లిలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపికని వాయిదా వేశామని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. రెండోరోజు బయటి వాళ్లు వచ్చి గొడవ చేశారని చెప్పుకొచ్చారు. అనవసర గొడవ కారణంగా రెండోరోజు వాయిదా పడిందని అన్నారు. ఎన్నిక ప్రాసెస్‌ను తాము అడ్డుకోలేదని స్పష్టం చేశారు. బాల్కసుమన్ తమ మీద రాళ్లు విసిరారని, దాడి చేశారని ఆరోపణలు చేశారు. రెండురోజులుగా సుమన్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో చెన్నూరు, క్యాతనప్లలెలో సరిగా ఎన్నికలు జరగలేదని, గుండాయిజంతో మున్సిపల్ ఎన్నికలు ఏకగ్రీవం చేశారని ఆరోపించారు. బీఆరఎస్ హయాంలో అధికార దుర్వినియోగం చేశారని విమర్శించారు. బీఆరఎస్ నేతలు క్యాంపు పెట్టుకుంటే ఎక్కడైనా తాము గొడవ చేశామా అని మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రశ్నల వర్షం కురిపించారు. తాము ఎలాంటి అధికార దుర్వినియోగం చేయలేదని తేల్చిచెప్పారు. మంత్రి, ఎంపీ కార్లపై రాళ్లు విసరడం సరైనదైనా అని నిలదీశారు. తమపై దాడిని ఖండిస్తున్నామని అన్నారు. బీఆరఎస్ నేతలు ఇంకా అధికారంలో ఉన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ఫైర్ అయ్యారు. బీఆరఎస్ అభ్యర్థి ఓడిపోయినా బాధలో బాల్కసుమన్ తమపై ఫ్రస్టేషన్ చూపుతున్నారన్ని ÷ర్ అయ్యారు. హరీశ్‌రావుకు ప్రజాస్వామ్యంపై గౌరవం ఉంటే సుమన్ తమపై చేసిన దాడిని ఖండించాలని అన్నారు. తాము చెన్నూరులో ఏరోజు బీఆరఎస్‌పై దాడి చేయలేదని... ఎవరినీ అరెస్ట్ చేయలేదని మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు.

## జాతీయ రహదారిపై లారీ ఢీ : వ్యక్తి మృతి

### గ్రామంలో విషాదం.



**నల్లబెల్లి, ఫిబ్రవరి 18 (నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం శనిగరం గ్రామ సమీపంలోని 365 జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ఈ విషాద ఘటనతో గ్రామంలో దిగ్భ్రాంతి వాతావరణం నెలకొంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, శనిగరం గ్రామానికి చెందిన బసవరాజుల కుమారస్వామి (50) బుధవారం ఉదయం వ్యక్తిగత పనిమీద బయటకు వెళ్లారు. ఈ సందర్భంగా రహదారి దాటుతుండగా భూపాలపల్లి వైపు నుంచి వేగంగా వస్తున్న లారీ (టీఎస్ 03 యు బి 0468) ఆయనను ఢీకొట్టింది. ఢీకొన్న తీవ్రత ఎక్కువగా ఉండటంతో కుమారస్వామి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదం గమనించిన స్థానికులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. లారీని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. కుమారస్వామి కుటుంబానికి ఏకైక ఆధారస్తంభంగా ఉన్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మృతి వార్త తెలిసి కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. గ్రామంలో పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు సంఘటనపై సంతాపం వ్యక్తం చేశారు. ఇటీవలి కాలంలో 365 జాతీయ రహదారిపై వాహనాల వేగం అధికంగా ఉండటం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వేగ నియంత్రణ చర్యలు చేపట్టి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## పదో తరగతి ఇంటర్నల్ మార్కుల పరిశీలన ప్రారంభం

### మేడపల్లి నుండి నందిగామ మండల పాఠశాలల వరకు ప్రత్యేక బృందాల తనిఖీలు



నల్లబెల్లి, ఫిబ్రవరి 18 (నినాదం):
వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలో నందిగామ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల పరిశీలన కార్యక్రమం ఈరోజు ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా మేడపల్లి ఉన్నత పాఠశాల లో ప్రత్యేక బృందం సమగ్రంగా రికార్డులు, మార్కుల పట్టికలు, ఉపాధ్యాయుల నమోదు పుస్తకాలను పరిశీలించింది. నల్లబెల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అంబి వసంత ఆధ్వర్యంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు గిన్నారపు బుచ్చన్న, ఆంగ్ల ఉపాధ్యాయులు సునీల్ పాల్గొన్న బృందం ఈ తనిఖీలను నిర్వహించింది. విద్యార్థుల అకాడమిక్ పురోగతి, అసైన్‌మెంట్లు, యూనిట్ పరీక్షల మార్కులు, హాజరు శాతం వంటి అంశాలను వారు ప్రత్యేకంగా పరిశీలించారు. పరీక్షల పారదర్శకత, నిష్పక్షపాత మూల్యాంకనం, రికార్డుల నిర్వహణలో ఖచ్చితత్వం వంటి అంశాలపై ప్రధానంగా దృష్టి సారించినట్లు బృంద సభ్యులు తెలిపారు. విద్యార్థుల అభ్యాస నైపుణ్యాలు మెరుగుపడేందుకు ఉపాధ్యాయులకు అవసరమైన సూచనలు కూడా ఇచ్చారు. రేపు గురువారం ఈ బృందం కేజీబీవీ పాఠశాల, కారుణ్య జ్యోతి పాఠశాల, నందిగామ ఉన్నత పాఠశాల రంగాపూర్ ఉన్నత పాఠశాల లలో కూడా తనిఖీలు చేపట్టనుంది. ఇదే సమయంలో, మేడపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి ఆధ్వర్యంలోని మరొక బృందం మిగతా పాఠశాలలో పరిశీలన కార్యక్రమాలు కొనసాగించనుంది. విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంపొందించడంలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా పాఠశాలల పనితీరు మెరుగుపడుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఆచారిని విమర్శించడం తగదు

### బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ శేఖర్ రెడ్డి




**కల్వకుర్తి, ఫిబ్రవరి 18 (నినాదం) :** మాజీ జాతీయ బీసీ కమిషన్ మెంబర్ తల్లోజు ఆచారిని వ్యక్తిగతంగా విమర్శించాడం తగదని బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ ఎన్నం శేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలో బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆమనగల్ మున్సిపాలిటీలో జరిగిన సమస్యలపై ఉప్పల వెంకటేష్ వ్యక్తిగతంగా ఆచారిని విమర్శించాడం విడ్డూరంగా ఉందన్నారు. ఉప్పల వెంకటేష్ ఆచారి పట్ల నీ పద్ధతిని మార్చుకోకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని అన్నారు. నీ నోటి దురుసుతో చైర్మన్ పదవి కోల్పోయావన్నారు. ఆర్యవైశ్య నాయకులు అన్ని పార్టీలలో ఉన్నారు. బిజెపి అభ్యర్థి కండె హరిప్రసాద్ ఆర్యవైశ్య నాయకుడే కదా ఆ వార్డులో ఓడిపోవడానికి ముఖ్య కారకుడు నువ్వే కదా అని విమర్శించారు ఇప్పటికైనా ఉప్పల వెంకటేష్ వ్యక్తిగత విమర్శలు చేస్తే ఖబర్దార్ ఊరుకునేది లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గుర్రాల రాంభూపాల్ రెడ్డి, కృష్ణ గౌడ్, శేఖర్ రెడ్డి, మోహన్ రెడ్డి, నరేష్ చారి, సురేందర్ గౌడ్, గంగాధర్, శ్రీశైలం, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో పారిశుద్ధ్యానికి పెద్దపీట

**హైదరాబాద్,ఫిబ్రవరి18(నినాదం):** గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి గారి ఆదేశాల మేరకు బుధవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారులు నగర పరిశుభ్రతపై ఇప్పటి వరకు తీసుకుంటున్న చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సి.ఎస్ కు వివరించారు. సమావేశంలో పరిశుభ్రత, చెత్త సేకరణ విధానం, పరిశుభ్రతా చర్యలు, ప్రజా ఆరోగ్య పరిరక్షణపై తీసుకుంటున్న చర్యలను సి.ఎస్ సమగ్రంగా పరిశీలించారు. వివరాలన్నంటిని ఎప్పటికప్పుడు డాష్ బోర్డ్ లో పొందుపరచాలని సి.ఎస్ ఆదేశించారు. జి.హెచ్.యం.సి పరిధిలో 4500 స్వచ్ఛ ఆటోలు ఇంటింటికి తిరిగి చెత్త సేకరిస్తున్నాయని, 2650 స్వయం సహాయక బృందాల సభ్యులు మొత్తం 18 వేల 557 మంది శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్నారని జి.హెచ్.యం.సి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తెలిపారు. నగర పరిధిలో రోజు వారిగా 7800 టన్నుల మేరకు గార్బేజ్ సేకరణ జరుగుతుందని అన్నారు. మున్సిపల్ విభాగం ప్రభుత్వంలో కీలకమని, ప్రజల అవసరాలకు తగినట్లుగా బాధ్యతలు నిర్వర్తించాలని, అధికారులు విధులలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించమని సి.ఎస్ అన్నారు. రాష్ట్రంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ మరింత సమర్ధవంతంగా ఉండేలా అధికారులు కృషి చేయాలని సూచించారు.


## ప్రారంభమైన 4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్

**హైదరాబాద్,ఫిబ్రవరి18 (నినాదం):** తెలంగాణ రాష్ట్ర పోలీస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న '4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2026' సైబరాబాద్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ క్రీడా జ్యోతిని అందించగా, డీజీపీ దానిని వెలిగించి పోటీలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని క్రీడాకారులు, అధికారులు కలిసి ఆలపించగా మైదానమంతా రాష్ట్ర స్ఫూర్తితో మారుమోగింది.

## దళితనాయకుడు బాల్క అరెస్టు దుర్మార్గం

### -కాంగ్రెస్ అక్రమాలను ఎదరించినందుకు అరెస్టా

### -మండిపడ్డ మాజీమంత్రి హరీష్ రావు



**హైదరాబాద్,ఫిబ్రవరి 18 (నినాదం):** క్యాతనపల్లిలో కాంగ్రెస్ అప్రజాస్వామిక, అహంకార చర్యలను అడ్డుకున్నందుకు మాజీ శాసనసభ్యులు, దళిత నాయకుడు బాల్క సుమన్ ను అరెస్టు చేసి నిర్బంధించడాన్ని మాజీ మంత్రి హరీష్‌రావు తీవ్రంగా ఖండించారు. క్యాతన్ పల్లిలో బీఆరఎస్ పార్టీకి పూర్తి మెజారిటీ వచ్చినా కూడా కాంగ్రెస్ పార్టీ పట్టపగలు ప్రజాస్వామ్యాన్ని పరిహసించిన తీరు చూసి యావత్ తెలంగాణ అసహ్యించుకుంటున్నదని అన్నారు. అధికార బలం, పోలీసు బలం, ధన బలంతో చట్టాలను తుంగలో తొక్కడం కాంగ్రెస్ అరాచక వైఖరికి పరాకాష్ట అని దుయ్యబట్టారు. రాష్ట్రమంతా కాంగ్రెస్ మార్కు గూండాగిరి రాజ్యమేలుతున్నది. మున్సిపల్ ఎన్నికల వేళ కాంగ్రెస్ మురుగు రాజకీయాల వాసన కమ్ముకున్నది. హంగ్ వచ్చిన చోటల్లా ప్రతిపక్ష నాయకులను సంత భేరం చేస్తూ, కిడ్నాపులకు తెగబడుతూ ప్రజా తీర్పును కాలరాస్తున్న తీరుకు నిదర్శనాలు ఎన్నోనని అన్నారు. జనగాంలో దళిత మహిళా కౌన్సిలర్ బీఆరఎస్‌కు మద్దతుగా చెయ్యి ఎత్తితే రిటర్నింగ్ ఆఫీసర్ సాక్షిగా కాంగ్రెస్ గూండాలు చేసిన దాడిని సమాజం కళ్లారా చూసిందని వెల్లడించారు. తమ కళ్ళెదుట ఒక దళిత మహిళా నాయకురాలిపై కాంగ్రెస్ నాయకులు దాడికి తెగబడితే అధికారులు, పోలీసులు కళ్లప్పగించి చోద్యం చూశారే తప్ప అడ్డుకోలేదని అన్నారు. ఒక్క క్యాతనపల్లే కాదు తొర్రూరు, జనగాం, ఇబ్రహీంపట్నం, జహీరాబాద్ సహా హంగ్ వచ్చిన ప్రతి చోటా ప్రజా తీర్పును గౌరవించకుండా చైర్మన్ పీఠాలను అడ్డదారుల్లో దక్కించుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో భూములను కబ్జా చేసినట్లే, రాజకీయ పీఠాలను కూడా కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. బాల్క సుమన్ ను భేషరతుగా విడుదల చేయాలని, ప్రజాస్వామిక వాతావరణంలో క్యాతన్ పల్లి చైర్మన్ ఎన్నిక జరిగేలా బాధ్యత వహించాలని ఎన్నికల కమిషన్ ను డిమాండ్ చేశారు.

## అట్రాసిటీ బాధితులకు ఇళ్ల పంపిణీ

### -ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నేరాలపై మంత్రి సమీక్ష

**హైదరాబాద్,ఫిబ్రవరి18 (నినాదం):** ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ బాధితులకు మంత్రి అడ్లూరి. లక్ష్మణ కుమార్ ఇళ్ల ను పంపిణ్ణి చేశారు. ఈ కార్యక్రమం మల్కాజ్గిరి జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగింది. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక నేరాలపై సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ, గిరిజన శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాధితులకు మంత్రి డబల్ బెడ్ రూమ్ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేయడం జరిగింది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం బాధితులకు దళిత, బడుగు, బలహీన వర్గాలకు అన్యాయం జరిగినప్పుడు, న్యాయం జరిగే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చట్టబద్ధంగా వ్యవహరిస్తూ వారికి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం బాసటగా నిలుస్తుందని మంత్రి శ్రీ లక్ష్మణ్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ బాధితులకు తగు న్యాయం చేసేలా చొరవ తీసుకోవాలని మంత్రి కోరారు. అనుకోకుండా దురదృష్టవశాత్తు కొన్ని సంఘటనలు జరిగినప్పుడు, బాధితులకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే అని అన్నారు. కేవలం డబుల్ బెడ్ రూమ్ లతో కాకుండా సంక్షేమ శాఖ ద్వారా బాధితులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు రుణాలతో పాటు ఇతర సహాయం, సబ్సిడీ పరంగా అందించేందుకు, జీవనోపాధి కల్పించే విధంగా జిల్లా కలెక్టర్ లు చొరవ తీసుకోవాలని మంత్రి ఆదేశాలు ఇచ్చారు.
కనుండి బాధితులకు ఎలాంటి ఆలస్యం జరగకుండా టైం బౌండ్ ప్రోగ్రాం రూపొందించుకొని వారికి న్యాయం చేయాలని ఆదేశించారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు పక్కదారి పట్టకుండా బాధితులకు న్యాయం చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అవమానం నష్టం జరిగిన బాధితులకు పిసిఆర్ పిఓఏ ఆక్ట్ చట్టం ప్రకారం న్యాయం చేయాలన్నారు. ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు బాధితుల పక్షాన నిరంతరం వారికి సహాయ, సహకారాలు అందిస్తున్నారని మంత్రి కొనియాడారు. ఎస్సీ ఎస్టీలపై ఎలాంటి దాడులు గాని ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడితే, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులకు ఆదేశించారు. అడ్వాన్స్ టెక్నాలజీని ఉపయోగించి వాస్తవంగా నష్టపోయిన వారికి వీలైనంత త్వరగా న్యాయం చేసే విధంగా చర్యలు చేపట్టాలని మంత్రి అడ్లూరి ఆదేశించారు. దళిత, గిరిజన వర్గాలు చదువు వల్ల గొప్పగా రాణించగలుగుతారని, అందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఇంటిగ్రేటెడ్ హాస్టల్ లను నిర్మాణం చేసేందుకు ప్రతి నియోజకవర్గంలో 200 కోట్ల రూపాయలతో బృహతర కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని మంత్రి అన్నారు. మంచి భవిష్యత్తు ఇవ్వటం మూలానే ఈ వర్గాలు ఉన్నత స్థాయికి చేరుకుంటారని మంత్రి తెలిపారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసి, బ్జడెట్లో నిధులు కేటాయించడం జరిగిందని అన్నారు. ఎస్సీ ఎస్టీ పిల్లలు గొప్పగా చదువుకుని రాణించగలరన్న ఆశాభావాన్ని మంత్రి వ్యక్తీకరించారు. చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన కోరారు. ఎస్సీ ఎస్టీలకు ఎలాంటి నష్టం ఇబ్బంది కలిగిన తాను ఎల్లప్పుడూ అండగా మంత్రి భరోసా ఇచ్చారు.